# కరణేషు మంత్రీ...

నిజం చెప్పద్దూ! శాస్త్రి అంటే నాకు ఒళ్ళు మంట. మెల్లకన్ను, తప్పడ ముక్కు, దొప్ప చెవులు, చప్పిడి దవడలు. బండ పెదవులు. చింపిరి జుట్టు, మాసిన గడ్డం. ఇవ్వన్నీ భరించవచ్చు గాక, కిళ్ళీ నములుతూ మాట్లాడుతుంటే, జెట్ స్పీడుతో ఎదుట వారి మీదకు దూకే, ఆ నోటితుంపరలు...అమ్మో ఎవరు సహించగలరు!

చెప్పండి?కానీ, నా శ్రీమతికి ఇవేమి అర్థంకావు. బంధుత్వం ఏమి లేకపోయినా వాడి మీద ఈగ వాలనివ్వదు. "అన్నయ్యా!... కాస్త కాఫీ తాగు,అన్నయ్యా! ఈ లడ్డూ నోట్లో వేసుకొని వెళ్లంటూ,వెర్రి అభిమానం చూపిస్తుంది. వాడి చూపులు ప్రమాద హేతువని, పచ్చని చెట్లు కూడా, వాడి వాడిచూపులకి దహించుకు పోగలవని, వాడు కాలుఎక్కడ పెడితే ,అక్కడ నాశనమేనని, ఐరన్ లెగ్ శాస్త్రి వంటి వాడని ఎన్నో సార్లు చెప్పినా, నా మాట కొట్టి పారేస్తుంది. "చాల్లేవండి, పిచ్చిమాటలు, గుడ్డి నమ్మకాలు. వాడి ప్రేమమాభిమానాలు మీకేం తెలుసు?" అంటూ ఒంటి కాలు మీద లేస్తుంది. ఈరోజు గేట్ లోంచి కారు తీసి,కొంచెం ముందుకు వెళ్లానో లేదో, వాడే, కిళ్ళీ నములుతో వెర్రి నవ్వు నవ్వుతూ, "బావా! ఆఫీసుకేనా?".అంటూ వెధవ పలకరింపు. ఏమి చెప్పను! వర్షాకాలంలో గట్టు తెగిన డ్రైనేజీ కాలువాలా, నా రక్తపోటు పెరిగింది. రోడ్డు మీద రెండు ప్రమాదాల నుండి తప్పించుకొని,ఎలాగోలా ఆఫీసుకి చేరాను.దాని తాళి గట్టిది కాబట్టి సరిపోయింది.లేకపోతే,నా ఫోటో వార్తా పత్రికలలో ప్రచురించబడేదే.

ఆఫీసు కెళ్లి సీటులో కూలబడి, ఈరోజు,ఆ శాస్త్రి గాడి గండం ఎలా గడుస్తుందోనని ఉద్వేగంతో ,ఏమి జరగబోతోందన్న భయంతో, సతమతమవుతుంటే, బాస్ వెంటనే రమ్మని కబురు. బాస్ గదిలోకి వెళ్లి నిలబడ్డాను. ఒక్క క్షణం బాస్, నా మీదకి చూపు సారించి, టేబిల్ మీద ఫైల్ చూస్తూ,"అయ్యగారు! మీరు... నిలబడ్డారా! తమరు నుంచుటే, నేను కూడా నిలబడాలి" అంటూ నిలబడేవాడిలా నటిస్తూ, కళ్లజోడు సవరించుకొంటూ, నాకేసి చూస్తూ,"మీరు లీవ్ పెట్టారు... కానీ,తమరికి లీవ్ లెటర్ ఇవ్వలేదని గురుతుందా?ఇస్తారా? మీ ఇంటికి వచ్చి ,తమరి నుండి లీవ్ లెటర్ తీసుకోమంటారా? చెప్పండి సార్! " అన్నాడు ప్రశాంతంగా. నాకు అర్థమయ్యింది. శాస్త్రి గాడి వెకిలి నవ్వు ప్రాభవం,ప్రభావం ప్రారంభమయ్యింది బాస్ వ్యంగ్య బాణాలు వాడిగా,వేడిగా సూటిగా నా గొంతు లో దిగి నన్ను మూగ వాడిని చేసాయి. ఆయన వెటకారం లోని 'కారం' నషాలమంటింది. కానీ నా నుండి సమాధానం ఏదీ రాకపోవడంతో, చెవిటి వాడిగా నటిస్తున్నానని కాబోలు బాస్ కోపం ఇంకో మెట్టెక్కింది. కష్టం మీద గొంతు సవరించుకొంటూ, "హఠాత్తుగా, మాపిన్ని చనిపోయిన వార్త తెలిసి...వెంటనే వెళ్ళవలసి వచ్చింది సార్." అన్నాను. లీవ్ లెట్టర్ ఆరోజు ఇవ్వలేక పోవడానికి కారణం చెప్పాలని నా తాపత్రయం.

"చూడండి, నేనడిగింది మీ పిన్ని గారి సంగతి కాదు. తమరు ఎంత తప్పు చేసారో, చేస్తున్నారో, తెలుస్తోందా? నేను మీ సెలవుని అంగీకరించకపోతే, ఏమి జరుగుతుందో చూడాలని వుందా?' అన్నాడు కళ్లు ఎగరేస్తూ. మళ్ళీ ఆయనే అన్నాడు, "మిమ్మల్ని సెలవు పెట్టదనడం లేదు. సెలవు ముందుగా సాంక్షన్ చేయించుకోండి. దాంట్లో ఏమిటి కష్టం?"ఐతే, మా పిన్ని మరణాన్ని ముందే పసిగట్టి, లీవ్ పెట్టు కోవాలా? అని నిలదీయాలనిపించింది.కానీ, కొంచెం నిగ్రహించుకొని "తప్పు తెలుస్తోంది సార్! లీవ్ లెటర్ కావాలంటే, ఇప్పుడే వ్రాసి, మీకు ఇస్తాను సార్," అన్నాను అభ్యర్థనగా.

"ఓహో! నాకు కావాలంటే ఇప్పుడే, వ్రాసి ఇస్తారా సార్! ఎంతటి మహానుభావులండీ, నా కోసం మీరు శ్రమ పడవద్దు సార్!" తల వంచుకొని ఫైల్స్ లో మునిగి పోయాడు.

అది మాములు వెటకారం కాదు. తేనె పూసిన కత్తులు నా నాలికతో మొదలై గుండెల్లో దిగాయి.

నా పరిస్థితి మీద నాకే జాలి వేసింది. 'నీ పని అయ్యింది, ఇక దయచేయ వచ్చన్నట్లు' బెల్ కొట్టాడు బాస్. గుమాస్తా లోపలికి వచ్చాడు ఫైల్స్ తీసుకొని. వాళ్ళ ఇద్దరి మధ్యా చర్చలు ప్రారంభమయ్యాయి. నా సమక్షం, వాళ్ళకి ఇబ్బందేమో! అనిపించింది.

బరువెక్కిన గుండెతో బయటకు నడిచాను. ఆఫీసులో ఎవరిని చూస్తున్నా, నాదయనీయ స్థితి చూస్తూ,వెకిలి నవ్వుతున్న శాస్త్రి లాగానే కనిపిస్తున్నారు. బాస్ మాటలు బాకులా పొడుచుకుని మనసుని బాధిస్తున్నాయి. దీనికంతటికీ కారణం...శాస్త్రి గాడు. వాడు కనబడితే, కసిగా కత్తితో పొడిచి చంపాలని వుంది. బాస్ కి నామీద కోపం వచ్చింది కాబట్టి, సాయంత్రం లోపు, నాకు శ్రీముఖం రావడం ఖాయం. క్రమశిక్షణ చర్యలో భాగంగా, ఇంక్రిమెంట్లు

ఆపడం కుడా జరగవచ్చు. ఆ శ్రీముఖాన్ని నా శ్రీమతి ముఖానికి చూపించి, ఈ రోజు శాస్త్రి గాడి శనిముఖ దర్శన ఫలితమిదని చెప్పాలి. ఏపని చేస్తే ఏమి జరుగుతుందోనని భయంగా వుంది నాకు రోజంతా.

భారంగా సమయం గడుస్తోంది. ఇంతలో, పక్కసీటు కృష్ణ కుమారి, "బాస్ గదిలో ఏవో రహస్య సంభాషణలు నడుస్తున్నాయట...దేని గురించో నీకు తెలుసా?" అంది. నా నోటితోనే నాసంగతులు చెప్పించాలని ఆమె ఉద్దేశ్యం. అవతలి వారి రోదన లోనూ వినోదం వెతుక్కుంటూ సంతోషించడం ఆమెకు వేడుక. అది గ్రహించే, "నీ బదిలీ సంగతే కాబోలు...."అన్నాను కొంటెగా, ఆమె ప్రతిచర్య కోసం ఎదురు చూస్తూ. ఆమె తన భంగపాటుని కప్పి పుచ్చుకొంటూ,"ఆ...నాకు తెలిస్తే లాభం ఏమిటి? తెలియక పోతే నష్టం ఏమిటి?" .అంటూ మూతి ముప్పయి రెండు వంకరలు, తిప్పుతూ వెళ్ళింది. గోడ గడియారం భారంగా తిరుగుతోంది నా మీద పగ తీర్చుకోవడానికి. అతి కష్టం మీద కాలక్షేపం చేసి, ఆఫీసు నుండి ఇంటికి బయలుదేరాను.

రోజు, నా కారు శబ్దం వినపడగానే, రివ్వుమంటూ పరిగెత్తుకొంటూ వచ్చే నా కూతురు ఆశ్రీత, దాని స్నేహితులు, టీవీ సీరియల్ చూస్తూ, నారాక కోసం ఎదురు చూసే భార్య విజయ ఎవరూ కనబడటం లేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా పరుచుకొంది. మనసు ఏదో కీడు శంకిస్తోంది.

నా రాకని కూడ  గమనించలేదు విజయ. మంచంపై నిద్ర పోతున్న పాప కాళ్ళ దగ్గరే తల వాల్చి కళ్ళు మూసుకొని కూర్చొంది. ఈ దృశ్యం నేను ఊహించనది.

"విజయా! ఏమయ్యింది  పాపకి?" అన్నాను అందోళనగా. మనసులో ఈరోజు ఆఫీస్ లో జరిగిన విషయాలు చెప్పాలని తహతహగా వుంది. శాస్త్రి గాడి సంగతి తేల్చేయాలన్న కసిగా వుంది, మనసులో ఒక మూల.

"మీకసలు బుద్ధి వుందా? మేము చచ్చామో, బ్రతికామో కూడా పట్టదా? ఏమనుకుంటున్నారు మీరు?" విజయ కంఠం బొంగురు పోతోంది. ఆమె కళ్ళ లోంచి నిప్పులు కురుస్తున్నాయి. ఒక్క నిమిషం ఆమె ప్రవర్తనకి విస్తుపోయాను. విజయ వెక్కి వెక్కి ఏడుస్తోంది."విజయా! ఏడవకు, ఏమి జరిగిందో చెప్పు..దయచేసి."అన్నాను ప్రేమ గా ఆమె చేతులు పట్టుకొని. నా చేతులు విసిరి కొడుతూ,"వున్నట్టుండి, పిల్లకి వాంతులు, విరోచనాలు.....క్షణాలలో  నీరసించిపోయి, కళ్ళు తేలేసింది. ఇంట్లో డబ్బులు కూడా లేవు."   ఆమె మాటల్ని మధ్యలోనే ఖండిస్తూ, "ఏమి మనిషివే, అంత సీరియస్ గా వున్నప్పుడు నాకు ఫోన్ చేసి చెప్పద్దా? ఆఫీసు నుండి పరిగెత్తుకొని రానా?"అన్నాను, తప్పంతా నీదేన్నట్టుగా. ఆ మాటలుకి ఎప్పుడూ రానంత కోపం వచ్చింది ఆమెకి. "అసలు, మీ ఫోన్ బతికే వుందా? చచ్చిందా? ఎన్ని సార్లు ఫోన్ చేశానో చూసారా?' అంటూ ఉరిమింది, ఉబికి వస్తున్న కన్నీటిని కొంగుతో తుడుచుకొంటూ.

అప్పుడు గుర్తుకు వచ్చింది. బాస్ గదిలోకి వెళుతుంటే, చరవాణిని నిద్ర పుచ్చిన సంగతి. ఆఫీసు గొడవలోపడి, దాని విషయమే మర్చిపోయా. నిజంగా ఇది నేను చేసిన పెద్ద పొరపాటే. నా బంగారుతల్లికి ఏదయినా జరగ కూడనిది జరిగితే, వీళ్ల పరిస్థితి ఏమిటి? జీవితంలో దిద్దుకోలేని పొరపాటయ్యేది.

గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి, విజయకి ఇచ్చి నెమ్మదిగా ఆమె ను ఊరడించాను. కొంచెం సేపటికి, ఆమె తేరుకొంది.

ఇప్పుడు నాకు బాగా అర్ధమయ్యింది. ఆ శాస్త్రిగాడి దరిద్రపు దృష్టి నా మీదే కాదు, నా ఇంటి మీద, నా పిల్ల మీద కూడా పడిందన్న మాట. అంతేకాదు, ఎప్పుడూ ఎంతో సంయమనం పాటించే నా శ్రీమతి హఠాత్తుగా 'చంద్రముఖి' గా మారి పోవడానికి కారణంగా కూడా ఆ శనిగాడు శాస్త్రి.

అవును,పెనం వేడిగా ఉన్నప్పుడే పెసరట్టు వేయాలని సామెత. ఇదే మంచి తరుణం. విజయ మనసు లోంచి శాస్త్రి ని తరిమేసి,ఇంటి పొలిమేరలకు కూడా, వాడిని  రాకుండా నిరోధించాలని గట్టిగా నిర్ణయించుకొన్నాను.

ఇంతలో, ఆశ్రీత లేచి కూర్చొని, గ్లూకోజ్ నీళ్లు తాగి, హాల్లోకి వెళ్లి, టీవీలో 'పంచతంత్రం' సీరియల్ చూస్తోంది. కొంతసేపటికి ఇంటి వాతావరణం యథాస్థితికి వచ్చింది.

"నేను కూరలు తరుగుతుంటాను. నువ్వు స్నానం చేసిరా ఈ లోపులో" అని వంటింట్లోకి వెళ్ళాను. నా పని పూర్తికావస్తుంటే విజయ తాజాగా తయారై వచ్చింది. కాఫీ కలిపి ఇచ్చి, నెమ్మదిగా కబుర్లు లోకి దింపా.

"విజయా! పాపాయిని ఆసుపత్రికి ఎలా తీసికెళ్లావు? ఇంట్లో డబ్బులు కూడా ఎక్కువగా లేవు. ఏమి చేసావ్? వివరాలు చెప్పు" అన్నాను. విజయ అంది,"మీకు ఫోన్ చేసి, విసిగిపోయి, పిల్లని సముదాయిస్తూ, ఇంటికి తాళం వేసి, పిల్లని ఎత్తుకొని గేట్ దాకా వెళ్లేసరికి నాకు ఆయాసం వచ్చింది. అప్పటికే పిల్ల స్పృహలో లేదు. నా చేతుల లోంచి జారిపోతోంది. భయంతో, ఏమీ పాలుపోవడం లేదు.

ఇంతలో శాస్త్రి అన్నయ్య ఆటోలో నుండి దిగాడు. నీ కోసం పూతరేకులు తెచ్చానంటూ. నా కేసి,

పిల్ల కేసి ఒక్క క్షణం చూసాడు. పరిస్థితి విషమిస్తోందని గ్రహించి, పిల్లని ఎత్తుకుని, నన్ను ఆటోలోకి తోసి, పిల్లని పట్టుకుని కూర్చోన్నాడు. ఆసుపత్రికి చేరుకొన్నాము కానీ, నాకేమీ తెలియడం లేదు. పిల్లని భుజానికెత్తుకొని, పరుగులాంటి నడకతో డాక్టర్ దగ్గరకు వెళ్ళాడు. ఏడుస్తూ, ఎవరితోనో ఏదో చెబుతున్నాడు. ఒక పావుగంట గడిచింది.

గది తలుపు తీసి, లోపలికి రమ్మంటూ సైగ చేసాడు. పిల్ల మంచంపై నిద్ర పోతోంది. ఇక భయం లేదు. నువ్వు నిశ్చింతగా వుండని నాకు చెప్పాడు.

మొత్తానికి వాడు దేవుడిలా వచ్చి, పెద్ద గండం నుంచి గట్టెక్కించాడు." అంది.

"కావచ్చు కానీ...నా మాట నమ్ము. అతని చూపులు.." అంటూ ఉపోద్ఘాతం ప్రారంభించాను.

"వాడ్ని మీరు ఎప్పుడూ ఆడి పోసుకొంటారు. వాడు ఏమి అపకారం చేశాడు?" నా కళ్ళ లోకి చూస్తూ అడిగింది.
"మంచి ప్రశ్నడిగావు. నే చెబుతాగా, నీకే తెలుస్తుంది, వాడి దృష్టి ఎంత ప్రమాదమో," అన్నాను. 'నీ అభిప్రాయమెలా మార్చగలనో చూడని' మనసులో నవ్వుకొంటూ.

"పొద్దున్న ఆఫీసుకి వెళుతుంటే...నవ్వుతూ వాడు ఎదురొచ్చాడు. లీవ్ లెట్టర్ ఇవ్వాలని తెలీదా? అంటూ బాస్ వెటకారం గా ఎన్ని మాటలన్నాడో తెలుసా? మీకు కావాలంటే ఇప్పుడే వ్రాసి ఇస్తానని చెప్పినా ….."వాక్యం పూర్తి కాకుండానే విజయ అంది," మా అన్నయ్యకి మీ లీవ్ లెట్టర్ కి ఏమిటి సంబంధం?

లీవ్ లెట్టర్ ఇవ్వడం మీ కర్తవ్యం కాదా? మీకు కావాలంటే, వ్రాసి ఇస్తాననడం తప్పు కాదా? లీవ్ లెటర్ ఇవ్వడం ద్వారా మీ బాస్ కి ఉపకారం చేస్తున్నారా?..ఇలాగేనా మాట్లడే పద్ధతి?"

సుప్రీంకోర్టు జడ్జీలా ప్రశ్నలు సంధించే సరికి తెల్లమొహం వేశాను. ఒక్క ప్రశ్నకి కూడా సమాధానం లేదు నా దగ్గర.

నిజమే, నేను బాస్ తో తప్పుగా మాట్లాడి కోపం తెప్పించాను.

ఇప్పుడు ఇంక ఆఫీసు సంగతి వదిలేయాలి. అందుకే మాట మారుస్తూ,"అది కాదు విజయా! మొన్న రాత్రి అన్నం తింటుంటే వచ్చాడా? కొత్త ఆవకాయా! ఘాటు బాగానే వుందే!" అంటూ దీర్ఘం తీసాడా, రాత్రంతా కడుపులో మంట వాంతులుతో ఎంత నరకం అనుభవించానో నీకు తెలియదా!" అన్నాను. ఆమె మొహంలో ప్రశాంతత మాయమయ్యింది.

"ఆపండి, వెర్రి మాటలు. ఆవకాయకి మా అన్నయ్యకు ముడి వేస్తున్నారు. ఎవరైనా వింటే నవ్విపోతారు. ఆవకాయ అన్నంలో, పుల్ల పెరుగు కలుపుకుని తింటే, మీ అజీర్తి ప్రేగులు రాగాలు తీయవూ?'అంది వెక్కిరిస్తూ.

"ఆపద సమయంలో ఆంజనేయుడిలా వచ్చి, పిల్ల ప్రాణాలు. కాపాడిన సంగతి తమరికి తెలియదు కదా? ఆ సమయంలో మీ నిర్వాకం ఏమిటో గుర్తు లేదా?" భావావేశానికి లోనై కళ్ళు తుడుచుకొంటూ అరిచింది.

నాలో ప్రశ్నల వర్షం కురుస్తోంది. నా ఆలోచనా విధానంలోనే ఏదో తేడా ఉంది. ఇంతలో గేట్ చప్పుడయ్యింది. "మావయ్యా!" అంటూ నా కూతురు పరుగున వెళ్ళింది. "మావయ్యా! మరి' పరోపకారం' కథ, ఎంత బాగుందో తెలుసా? నీకు చెప్పనా?," అంటోంది ఆశ్రిత. పిల్లని ఎత్తుకొని ముద్దాడుతూ, శాస్త్రి లోపలికి వచ్చాడు.

"నీ సహాయం గురించే బావ గారికి చెబుతున్నానురా!"అంటూ మంచి నీళ్ళిచ్చింది విజయ.

"బావ గారు వచ్చారో లేదో తెలుసుకొందామని, పిల్లని నిన్ను పలకరించి పోదామని వచ్చానే. దూరం వెళ్లాలిగా. మరి వుంటా"నంటూ, పిల్లకి టాటా చెబుతూ, గేటు దాటాడు.

జరుగుతున్నదంతా ప్రేక్షకుడిలా చూస్తూ నిలబడ్డా. నిజంగానే నా నోరు మూగబోయింది. మొదటిసారి శాస్త్రి మీద గౌరవం కలిగింది.

మనిషి బాహ్య రూపాన్ని మాత్రమే చూసి, వాళ్ళని వెక్కిరిస్తూ, అజ్ఞానానికి అంధ విశ్వాసాలను కలిపి,నన్ను నేనే గొప్పవాడి గా భావిస్తూ జీవిస్తున్న, నేను నిజంగా కళ్లున్న కబోదిని. మూఢ నమ్మకాలకి దూరంగా వుండి, అదే వ్యక్తిని అభిమానించే నా అర్ధాంగి ఔన్నత్యాన్ని అర్ధం చేసుకొంటుంటే, పశ్చాత్తాపంతో మనసు బరువెక్కింది. కనువిప్పు కలిగించిన శ్రీమతి పట్ల చెప్పలేని అదో ఇది కలిగింది ఆ క్షణంలో. "ఆలయాన వెలిసిన ఆ దేవుని రీతి, ఇల్లాలే ఈ జగతి కి…" టీవీలో పాట వినవస్తోంది.

చూడగలిగే చక్షువుకి ,సృష్టిలో ప్రతీదీ ఎంతో సౌందర్యంగా, కనిపించి, పరవశాన్ని కలిగిస్తుంది. ఇది నిజం.

*****

**రచన:**

సిహెచ్. వేంకట సత్యసాయి పుల్లంరాజు